
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.6
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 4 అక్టోబరు 2024



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐదుగురు ఎస్ఐల బదిలీ

ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ హైదరాబాద్ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయడంలో విఫలం కావడంతో పాటు పీడీఎస్ రైస్ ఇతర అక్రమ కార్యక్రమాలకు సహకరిస్తున్నందున బదిలీ వేటు పడింది. 7

జిల్లాలో నూతన ఇసుక పాలసీ


(ఫైల్)

- ప్రణాళికల రూపకల్పనకు చర్యలు
- నిర్మాణ పనులకు తీరనున్న ఇసుక కొరత
- ఆన్‌లైన్ సరఫరాతో తగ్గనున్న ఇసుక ధరలు
- ప్రస్తుతం అనుమతులు ఇవ్వని అధికారులు
- అక్రమమార్గంలో సాగుతున్న దందా

జిల్లాలో వ్యక్తిగత, ప్రభుత్వ నిర్మాణ పనులకు ఇసుక లభించడం లేదు. స్థానికంగా ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వడంలేదు. ఇటీవల వర్షాలకు మూసీ ప్రాజెక్టు నిండి నదిలో నీరు ప్రవహిస్తుండటంతో ఇసుక లభ్యత కరువైంది. ఈ కారణంగా ఇసుక ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేదలకు ఇళ్ల నిర్మాణాలు భారంగా మారాయి. అయితే ఇలాంటి పరిస్థితుల నుంచి సామాన్యులు బయటపడేందుకు నూతన ఇసుక పాలసీ అమలుకోసం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఇంటికే ఇసుక రవాణా చేయాలని భావిస్తున్నారు. ఈ విధానంతో ఇసుక ధరలు మరింత తగ్గి సామాన్యుడికి అందుబాటులోకి రానుంది.

\- సూర్యాపేట(కలెక్టరేట్)

జిల్లాలో గతంలో ఇసుక రవాణాకు పలుప్రాంతాల్లో అధికారులు అనుమతులు ఇవ్వడంతో వ్యాపారులు రవాణాచేశారు. దీంతో నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. కానీ ఇటీవల అనుమతులు నిలిపివేయడంతో పాటు ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టడంతో అక్రమ దందాకు కూడా చెక్‌పడింది. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని కొంతమంది వ్యాపారులు అక్రమమార్గంలో ఇసుకను రవాణా చేస్తూ పలుచోట్ల పోలీసులకు పట్టుబడుతున్నారు.

భారీగా పెరిగిన ధరలు

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు పలు ప్రాంతాల్లో ఇసుక లభ్యత ఉండేది. ఇటీవలి వర్షాలకు వాగుల్లో వరద ఉధృతి పెరగడంతో ఇసుక లభ్యం కావడం లేదు. అయితే అక్రమమార్గంలో ఇసుక తరలిపోతుండడంతో దృష్టి సారించిన అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారు. ప్రతి రోజూ జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో ఇసుకట్రాక్టర్లు పట్టుబడుతున్నాయి. ఇదిలా ఉండగా కొంతమంది వ్యాపారులు ఇసుకను పెద్దమొత్తంలో డంప్ చేశారు. ప్రస్తుతం ఇసుక కొరత ఏర్పడటంతో ధరలు భారీగా పెంచారు. గతంలో ట్రాక్టర్ ఇసుకకు రూ.2 వేల నుంచి రూ.2200 వరకు ఉండేది, ప్రస్తుతం రూ.3వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఎక్కువ చెల్లించినా కొన్నిచోట్ల ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది.

పూర్తయిన సమీక్షలు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ప్రజలకు ఇంటి వద్దకే ఇసుకను అందించేందుకు నూతన ఇసుక పాలసీని అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం ఇటీవల కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఇతర జిల్లాలో అమలవుతున్న నూతన ఇసుక పాలసీ విధానాన్ని అధ్యయనం చేసి జిల్లాలోనూ అమలుచేయాలని ప్రణాళిక రూపొందించారు. దీంతో నూతన ఇసుక పాలసీ విధానం త్వరలో అమలు కానుంది.

అక్రమమార్గాల్లో

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ఇంకా సాగుతోంది. ఇప్పటివరకు ట్రాక్టర్లలో అనుమతులు ఉన్నా, లేకున్నా సాగిన దందా ఇటీవల ఏకంగా లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. ఎక్కువగా సూర్యాపేట మండలం రాయినిగూడెం, టేకుమట్ల, కేటీఅన్నారం, కాసరాబాద, పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్, అనాజీపురం, అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం, చాకలిగూడెం, కొత్తగూడెం, నాగారం మండలంలోని పేరబోయినగూడెం, మోతె మండలంలోని కూడలి, ఉర్లుగొండ, ఆత్మకూర్(ఎస్) మండలంలోని మక్తాకొత్తగూడెం, శెట్టిగూడెం, పాతర్లపహాడ్, బొప్పారం, ముక్కుడుదేవులపల్లి, రామన్నగూడెం, నూతనకల్ మండలంలోని యడవెల్లి, లింగంపెల్లి, దిర్శనపల్లి, మామిళ్లమడవ గ్రామాల నుంచి ఇసుకను రవాణా చేస్తున్నారు.

కోరుకున్న చోటుకే ఇసుక రవాణా

నూతన ఇసుక పాలసీ విధానంలో భాగంగా ముందుగా ఇసుక లభించే ప్రాంతాలను మైనింగ్ శాఖ అధికారులు గుర్తించనున్నారు. అనంతరం వాటి పరిధిలో ట్రాక్టర్ల యజమానుల నుంచి నిర్ణయించిన మొత్తాన్ని డిపాజిట్ రూపంలో సేకరించి నూతన ఇసుక పాలసీకి అనుమతిస్తారు. ఇసుక రవాణాకు నమోదు చేసుకున్న ట్రాక్టర్ల ద్వారానే ఇసుకను సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇసుక అవసరమైన వారు మీ సేవా కేంద్రాల్లో వారి దూరాన్ని బట్టి డబ్బులు చెల్లించి రశీదు పొందాలి. ఆ రశీదును ఇసుక పాలసీ నిర్వహకులకు అందిస్తే దాని ఆధారంగా ఇసుకను దిగుమతి చేస్తారు. మొదటి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఓ ధరను నిర్ణయించనున్నారు. అందులో రవాణా ఖర్చు, ఇసుక లోడింగ్ చార్జి, నిర్వహణ ఖర్చు, సీనరేజ్‌ల చార్జీ, గ్రామపంచాయతీ పన్ను ఈవిధంగా అన్ని కలిపి సుమారు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1800వందల నుంచి రూ.2వేలుగా నిర్ణయించే అవకాశాలు ఉన్నాయి. అందులో నుంచి ట్రాక్టర్ కిరాయి, లోడింగ్ చార్జీ, మొత్తం ట్రాక్టర్ యజమాని బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. ఈ విధంగా నూతన ఇసుక పాలసీని అమలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. నూతన పాలసీని అమలు చేస్తే ఇసుక అక్రమ దందాను అరికట్టడంతో పాటు వినియోగదారులకు తక్కువ ధరలో ఇసుక లభిస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఈ విధానం నల్లగొండ జిల్లాలో కొన్నేళ్లుగా అమలు చేయడంతో సత్ఫలితాలు ఇస్తోంది.

ఆన్‌లైన్ విధానంతో తక్కువ ధరకు ఇసుక



ఆన్‌లైన్ విధానం ద్వారా జిల్లాలో వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించే అవకాశం ఉంది. నూతన ఇసుక పాలసీతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది. అక్రమంగా ఇసుక తరలింపునకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది. సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్న ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుకను రవాణా చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు దరఖాస్తుదారుడు పేర్కొన్న అడ్రస్‌కు ఇసుకను రవాణా చేస్తారు.

\- తేజస్ నందలాల్ పవార్, కలెక్టర్



విద్యార్థుల కోసం.. తెలంగాణ దర్శిని

- సాంస్కృతిక, వారసత్వ చరిత్రపై అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమం
- ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఉచితం

తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక వారసత్వంపై అవగాహన కల్పించడం, సందర్శనీయ స్థలాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాలను మెరుగుపర్చే లక్ష్యంతో 'తెలంగాణదర్శిని'కి రూపకల్పన చేసింది.

● భువనగిరి టౌన్

రెండో తరగతి నుంచి డిగ్రీవరకు విద్యార్థులు విజ్ఞాన, వినోద యాత్రలకు వెళ్లేలా పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీలను రూపకల్పన చేసింది. అయితే తెలంగాణదర్శినిలో పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా యాత్రలకు వెళ్లే అవకాశం కల్పిస్తోంది. ప్రతీ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది విద్యార్థులను తెలంగాణదర్శినిలో భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రస్తుత విద్యా సంవత్సరానికి రూ.12.10కోట్లను విడుదలచేసింది. దీంతో పేదరికంతోపాటు పలు కారణాలతో యాత్రలకు దూరంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు సందర్శనీయ స్థలాలను వీక్షించే అవకాశం లభించింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న సుమారు 3.25లక్షల మంది విద్యార్థుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపిక చేసిన విద్యార్థులకు అవకాశం లభిస్తుండగా, మిగతా విద్యార్థులకు కూడా మరుసటి విద్యా సంవత్సరాల్లో తెలంగాణ దర్శినిలో అవకాశాలు లభించనున్నాయి.

టూర్ ప్యాకేజీ ఇలా..

రెండో తరగతి నుంచి నాలుగో తరగతి విద్యార్థులు సమీపంలోని స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు లేదా పార్కుల సందర్శన. ఐదో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు 20నుంచి 30 కిలోమీటర్లలోపు ప్రదేశాల సందర్శన. 9 నుంచి ఇంటర్ వరకు రెండు రోజులపాటు 50 నుంచి 70 కిలోమీటర్లలోపు ప్రదేశాలు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజులపాటు జిల్లా వెలుపలగల సందర్శనీయ స్థలాలకు వెళ్లవచ్చును.

పాఠ్య పుస్తకాల్లో చదువుకుంటున్నా..

పెరుగుతున్న పోటీనేపథ్యంలో పిల్లలు కేవలం చదువులకే పరిమితమవుతున్నారు. అడపా దడపా క్రీడలు, సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొంటున్నప్పటికీ తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం తదితర అంశాలను పాఠ్య పుస్తకాల్లో చదువుకుంటున్నప్పటికీ నేరుగా చూసే అవకాశం కొద్ది మంది విద్యార్థులకే లభిస్తోంది. అలాగే గతంలో కూడా విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలకు ఉపాధ్యాయులు తీసుకెళ్లే వారు. కానీ పలు కారణాలతో కొన్నేళ్లుగా ఆ యాత్రలు కనుమరుగయ్యాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం అమల్లోకి తేనున్న 'తెలంగాణదర్శిని'తో ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులందరూ ఉచితంగా తెలంగాణ వైభవం, చారిత్రక, ఆధ్యాత్మిక కట్టడాలు, శాస్త్రీయ ప్రాముఖ్యం ఉన్న ప్రదేశాలు ఇతర ప్రాజెక్ట్‌లను నేరుగా చూడనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలలు ఇంటర్, డిగ్రీ కళాశాలలవారీగా దర్శిని ప్రోగ్రాంను పర్యాటక శాఖ విడుదలచేసింది. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ గురుకులాలలో చదువుకుంటున్న రెండో తరగతి నుంచి నాలుగో తరగతికి ఒక్కో విద్యార్థిపై రూ.300, 5 నుంచి 8వ తరగతి ఒక్కో విద్యార్థిపై 9 నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒక్కో విద్యార్థిపై రూ.2వేలు, డిగ్రీ విద్యార్థులకు ఒక్కో విద్యార్థి రూ.4వేలు వ్యయం చేయనుంది.

ఉమ్మడి జిల్లాల్లో సందర్శనీయ స్థలాలు

ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యాటక, బహుళార్థక సాధక ప్రాజెక్టులు, రిజర్వాయర్లతో పాటు పలు సందర్శనీయ స్థలాలున్నాయి. అలాగే జిల్లా సమీపంలోనే హైదరాబాద్ నగరం, వరంగల్, విజయవాడ తదితర సందర్శనీయ నగరాలున్నాయి. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో యాదగిరిలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్, బుద్ధవనం, నల్లగొండలోని ఛాయా సోమేశ్వరాలయం, పానగల్లు ఆలయం, పురావస్తుశాఖ మ్యూజియం, భువనగిరి ఖిల్లా, కొలనుపాక, దేవరకొండ కోట, ఫణిగిరి,బస్వాపూర్ రిజర్వాయర్, పోచంపల్లి, రాచకొండ గుట్టలు, వాడపల్లి, కృష్ణానదీ తీరం, చెర్వుగట్టు రామలింగేశ్వరాలయం, మూసీ ప్రాజెక్ట్ తదితర ప్రాంతాలున్నాయి.

విద్యార్థులకు మంచి అవకాశం

తెలంగాణ దర్శినితో విద్యార్థులు చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు. దీంతో పాఠ్యపుస్తకాల్లో చదువుకున్న ప్రదేశాలను నేరుగా చూసే అవకాశం లభించనుంది. తరగతి గదుల్లో పుస్తకాలతో పోటీపడుతున్న విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలకు వెళ్లనుండడంతో మానసిక ఉల్లాసం లభించనుంది. తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలు, దేశ చరిత్రపై, స్థానిక ప్రాముఖ్యలపై అవగాహన పెరుగనుంది.

ఇంద్రపాల కవిత, ప్రిన్సిపల్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, ఆలేరు.

హుజూర్‌నగర్‌కు ఐటీఐ కళాశాల మంజూరు

హుజూర్‌నగర్, అక్టోబరు 3 : హుజూర్‌నగర్ పట్టణానికి ఐటీఐ కళాశాల మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెంబరు 13 విడుదల చేసింది. గతంలో పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద మంజూరుచేసిన అడ్వాన్డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ) కళాశాల మంజూరు కాగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాగా అదే కళాశాల పక్కనే నూతన ఐటీఐ కళాశాలను కూడా నిర్మించనున్నారు. ఇదిలాఉండగా సెప్టెంబరు 28న ఐటీఐ కళాశాలను మంజూరు చేయగా గురువారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యాలయం విడుదల చేసింది. భవన నిర్మాణానికి రూ.14.35 కోట్లు మంత్రి ఉత్తమ్ మంజూరుచేయించారు. కాగా మొత్తం 5 కోర్సులలో 216 మంది విద్యార్థులతో ప్రారంభం కానున్న ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌తో సహా 8 పోస్టులను మంజూరు చేశారు. గతంలో మంజూరైన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌తో పాటుగా పారిశ్రామిక శిక్షణ సంస్థను మంజూరుచేయించారు. ఈ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మన్, డీజిల్ మెకానిక్‌తో పాటు వెల్డర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి రెండో ఐటీఐ కళాశాలను మంజూరు చేయించడం గమనార్హం.

ఐటీఐ కళాశాల ఒక వరం: మంత్రి ఉత్తమ్



నిరుద్యోగులకు ఐటీఐ కళాశాల ఒక వరం లాంటిదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఐటీఐ మంజూరు చేయించిన శుభసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఐటీఐ కళాశాలతో పాటు మరో పారిశ్రామిక శిక్షణ సంస్థను మంజూరు చేయించామన్నారు. భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. హుజూర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మోడల్ కాలనీని కూడా డిసెంబరు చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా పట్టణానికి అవుటర్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తామన్నారు. ఏరియా ఆసుపత్రికి సిటీ స్కాన్ మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. త్వరలోనే బ్లడ్‌బ్యాంక్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు.

జిల్లాలో డీజేల వినియోగంపై నిషేధం: ఎస్పీ

సూర్యాపేటక్రైం, అక్టోబరు 3: జిల్లాలో డీజేల వినియోగంపై నిషేధం విధించినట్లు సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీ వరకు డీజేల వినియోగం నిషేధమన్నారు. డీజేలతో పాటు అధికంగా శబ్దం వచ్చే సౌండ్ సిస్టమ్‌లను నిషేధిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో డీజేల నుంచి వచ్చే శబ్దాలతో ప్రజా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఇండియా లునారస్ అంబాసిడర్‌గా మోహనసాయి

- హుజూర్‌నగర్ వాసికి జాతీయ స్థాయిలో గుర్తింపు


అన్‌లాగ్ ఆస్ట్రోనాట్ ఆకుల మోహనసాయి

హుజూర్‌నగర్, అక్టోబరు 3: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన అన్‌లాగ్ ఆస్ట్రోనాట్ ఆకుల మోహనసాయికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన అనలాగ్ స్పేస్ మిషన్‌లో ఒకటైన లూనారస్ రీసెర్చ్ స్టేషన్‌లో ఇండియా అంబాసిడర్‌గా ఆయన నియమితుడయ్యారు. పోలాండ్ లూనారస్ రిసెర్చ్ స్టేషన్ సంస్థ ప్రతినిధులు లెషెక్, అగతలు ఈ విషయాన్ని ప్రకటించగా, మోహనసాయి గురువారం మీడియాకు వెల్లడించారు. అంతరిక్ష పరిశోధనను ప్రోత్సహించేందుకు భారతదేశం, అంతర్జాతీయ అంతరిక్ష సమాజాల మధ్య సహకారాలను పెంచడంలో దోహపడనున్నారు. గతంలో ఒకసారి 18రోజులు, మరోసారి 28రోజుల పాటు పోలాండ్ అంతరిక్షంలో శిక్షణ పొందిన మోహనసాయి ఇప్పుడు భారతదేశ అంబాసిడర్‌గా ఎంపిక కావడం గమనార్హం. మోహనసాయి ప్రస్తుతం మహారాష్ట్రలోని అమిటీ యూనివర్సిటీలో మాస్టర్స్ ఆఫ్ ఆస్ట్రో బయాలజీ, స్పేస్ సైన్స్‌లో చివరి సంవత్సరం చదువుతున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో భారతదేశంలో చేరిన 9 మంది విద్యార్థుల తొలి బ్యాచ్‌కు చెందిన తెలంగాణ నుంచి వచ్చిన తొలి ఆస్ట్రో బయాలజీ విద్యార్థిగా అతడు నిలిచాడు.

ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 3 : రాష్ట్రంలో ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 60.73లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారన్నారు. 1.47కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకోసం అధికారులు అవసరమైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సీజన్ నుంచే సన్నరకాలకు క్వింటాకు రూ500 బోనస్ ఇస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. దొడ్డు రకాలను సన్న రకాల్లో కలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మౌలికవసతుల ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. కలెక్టర్లు ప్రతిరోజూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు.

ముందస్తు ప్రణాళికతో వెళ్తాం: కలెక్టర్

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. జిల్లాలో సన్నరకం ధాన్యం ఎక్కువగా సాగు చేసినందున సన్న, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్‌డీవో అప్పారావు, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీటీవో సురేష్‌రెడ్డి, డీఎస్‌వో రాజేశ్వర్, సంతోష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, డీటీసీఎస్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

పకడ్బందీగా సర్టిఫికెట్లు పరిశీలించాలి

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పకడ్బందీగా పరిశీలించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అభ్యర్థు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో 386 మంది 1:3 నిష్పత్తిలో ఎంపికయ్యారని, ఈ నెల 5వ తేదీ వరకు సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 206 మంది సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంఈవోలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, వస్రాం, వెంకటయ్య, శ్రవణ్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, దీపాదేవి, శ్రీహరి, శేఖర్, శ్రీనివాస్, ఉపేందర్, వెంకటరమణ, ఉషారాణి, మల్లారెడ్డి, బీఎల్ఎన్ చారి పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేకు సహకరించాలి

పంచాయతీరాజ్ కమిషనర్ అనితారామచంద్రన్


సర్వే సందర్భంగా స్థానికులతో మాట్లాడుతున్న అనితారామచంద్రన్

మద్దిరాల, అక్టోబరు 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డిజిటల్ కార్డు సర్వేకు సహకరించాలని పంచాయతీరాజ్ కమిషనర్ అనితారామచంద్రన్ అన్నారు. గురువారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నిర్వహించిన కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. కుటుంబ వివరాలను పూర్తిగా అందజేయాలని యజమానులను కోరారు. అధికారులు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి డిజిటల్ కార్డులను అందించాలన్నారు. అదేవిధంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, మండల ప్రత్యేకాధికారి నాగయ్య, ఏపీవో గుండు వెంకన్న, ఎంపీవో ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శులు పుష్ప, బద్ధం ఉమ, అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల కోసం చట్టాలు అమలుచేయాలి


కోదాడలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోదాడ టౌన్ / హుజూర్‌నగర్ / తుంగతుర్తి, అక్టోబరు 3 : దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులకు అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పలుచోట్ల గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి కోర్టుల ఆవరణల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లో సిటి సివిల్ కోర్టులో న్యాయవాది షేక్ ఖలీంపై కేసు ప్రత్యర్థులు సెప్టెంబరు 29న దాడికి పాల్పడటం సరికాదన్నారు. వృత్తిపరంగా నిక్కచ్చిగా వ్యవహరించే న్యాయవాదులపై దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడులకు పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోదాడలో జరిగిన నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కే మూర్తి, ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు తమ్మినేని హనుమంతరావు, కాకర్ల వెంకటేశ్వరరావు, పాలేటి నాగేశ్వరరావు, రంజాన్‌బాషా, సిలివేరు వెంకటేశ్వర్లు, ఏదుల కృష్ణయ్య, శ్రీదేవి, ఉయ్యాల నరసయ్య, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. హుజూర్‌నగర్‌లో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి జక్కుల వీరయ్య, కాల్వ శ్రీనివాసరావు, నట్టె సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా అదనపు న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, యాదగిరి, గోపాలకృష్ణ, శ్రీనివాస్, సురేష్, గోపీ, లక్ష్మారెడ్డి, అంజయ్య, నాగార్జున, చంద్రయ్య, సైదాహుస్సేన్, శ్రీనునాయక్, వెంకటేష్ పాల్గొన్నారు. తుంగతుర్తిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జిల్లా కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఫర్హీన్, న్యాయవాదులు బానోతు ప్రతాప్, చంద్రమౌళి, రాజారాం, అనిల్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పూర్తి


పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, అక్టోబరు 3: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి మహాక్షేత్రంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారం నిర్వహించిన పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. ఉదయం మూలవరులు, ఉభయ దేవేరులతో పాటు పరివార దేవతలు, ఆలయ శిఖరాలకు ధారణచేసిన పవిత్రలను విసర్జన చేశారు. సప్తాదశ నదుల నుంచి తెచ్చిన పుణ్యజలాలతో సంప్రోక్షణ చేశారు. అనంతరం శాంతికల్యాణం నిర్వహించారు. బీవీ వాసుదేవాచార్యులు నేతృత్వంతో జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు టీ శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనాదాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యులు, దేవస్థాన పాలకమండలి సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు
త్వరలో భారీ బహిరంగ సభ

నల్లగొండ క్రైం, అక్టోబరు 3: ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు త్వరలో హైదరాబాద్‌లో 10లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించ నున్నట్లు మాల ప్రజా సంఘాల జేఏసీ జాతీయ చైర్మన్ గండమల్ల చెన్నయ్య అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు చెన్నూ రు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను పునఃసమీక్షించి మాల, మాదిగలు కలిసి ఉండేలా వర్గీకరణను నిలిపివేయాలని కోరారు. కొన్ని రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు లకుమాల మధుబాబు, వైస్ చైర్మన్ తాళ్లపల్లి రవి పాల్గొన్నారు.

మూగ రోదన

» లారీలు, డీసీఎంలలో రాత్రి సమయాల్లో తరలింపు » గుట్టుచప్పుడు కాకుండా మూగజీవాలను ఎత్తుకెళ్తున్న ముఠాలు



పల్లె ప్రకృతివనంలో అక్రమంగా దళారులు దాచి ఉంచిన మూగ జీవాలు(ఫైల్)

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 3: పశువుల కొమ్ము లు తాళ్లతో కట్టి, మూతులకు గుడ్డలు చుట్టి ఇరుకైన లారీ లు, డీసీఎంలలో కుక్కి మూగ జీవాలను కబేళాలకు తరలిస్తున్నారు. పశువుల వ్యాపారం ముసుగులో దళారులు మూ గ జీవాలను సంతలో కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుం డా మారుమూల తండాలు, గ్రామాల్లో రహస్య ప్రదేశాలకు తరలిస్తున్నారు. డంపింగ్ చేసిన మూగజీవాలను వారానికి రెండుసార్లు రాత్రికి రాత్రే వాహనాల్లో హైదరాబాద్, కేరళతోపాటు పలు ప్రాంతాల్లోని కబేళాలకు తరలిస్తున్నారు. ఈ తతంగం కొన్నేళ్లుగా సాగుతున్నా పోలీసులు, ఆర్టీవో, పశు సంవర్ధకశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. తిరుమలగిరి(సాగర్) మండలంలోని గరెకనట్‌తండాలోని పల్లె ప్రకృతివనంలో మూగజీవాలను ఉంచిన తీరే ఈ దందాకు రుజువుగా నిలుస్తోంది.

పర్యవేక్షించాల్సిన అధికారులే పట్టించుకోకుంటే..

తిరుమలగిరి(సాగర్) మండలంలోని గరెకనట్‌తండాలో ప్రభుత్వ ఆధీనంలోని పల్లె ప్రకృతివనం కేంద్రంగా దళారులు ఈ దందాకు తెరలేపారు. తండాకు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో గుట్టకు ఆనుకొని ఉన్న పల్లె ప్రకృతివనంలో పలు సంతల్లో కొనుగోలు చేసిన లేదా గ్రామాల్లో అక్రమంగా తీసుకొచ్చిన మూగ జీవాలను దాచిపెట్టి వారానికి రెండుసార్లు హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఐదేళ్లుగా ఈ పల్లె ప్రకృతివనం లో పశువులను అక్రమంగా ఉంచుతున్నా గత, ప్రస్తు త పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మొక్కల పెంపకంపై పర్యవేక్షించాల్సిన కార్యదర్శులు, సిబ్బందికి తెలిసే తతంగమంతా నడుస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. పల్లె ప్రకృతివనం గేటుకు తాళాలు సైతం దళారులే వేసుకుంటున్నట్లు సమాచారం.

కర్కశంగా కుక్కి.. లారీల్లో తరలిస్తూ..

లారీలు, డీసీఎంలలో మూగ జీవాలను కట్టేసి కుక్కి అవి బయటకు కన్పించకుండా వాహనాల పై భాగాన్ని టార్పాలిన్లతో మూసివేసి రాత్రికి రాత్రే హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్లతండా, గరెకనట్‌తండా, పెద్దవూర, త్రిపురారం మండలాల్లో డంపింగ్‌లు, కబేళాలకు తరలించే వ్యాపారం చాలా ఏళ్లుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. పశురవాణా చట్టం-1978 ప్రకా రం పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే మం డల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో తీర్మానం చేయాలి. లారీల్లో నాలుగు, వ్యాన్‌లో రెండు పశువులను మించి తరలించవద్దు. వాటికి అవసరమైన సౌకర్యం కల్పించి ఎందుకు తరలిస్తున్నారో అధికారుల అనుమతులు తీసుకోవాలి.

డొంక కదలిందిలా..

గత నెల 26న మండలంలోని నెల్లికల్‌కు చెం దిన గుండెబోయిన శ్రీను అనే రైతు తన రెండు ఎడ్లను గ్రామానికి సమీపంలో ఉన్న రోడ్డు వెంట ఉన్న పశువుల కొట్టంలో కట్టేశాడు. కొన్ని రోజులుగా గమనిస్తున్న పశువుల దొంగలు అదే రోజు అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా కొట్టంలోని రెండు ఎడ్లను గూడ్స్ ఆటో(బొలేరో) వాహనంలో ఎక్కించుకొని పరారయ్యారు. సదరు రైతు ఎద్దులకు గడ్డి వేసేందుకు తెల్లవారుజామున మూడు గంటలకు కొట్టం వద్దకు వచ్చి చూడగా ఎద్దులు లేకపోవడంతో అవాక్కయ్యాడు. దీంతో రైతు స్థానికులతో కలిసి వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని వ్యాపారుల దుకాణాల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా తెల్లవారుజామున 2.08గంటలకు బొలెరో వాహనం నెల్లికల్ దాటుతున్నట్లు కన్పించింది. అదే ఆ వాహనాన్ని, దానిని అనుసరిస్తున్న ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వారు కొంపల్లి గ్రామం వద్ద రాత్రి 2.37గంటలకు చేరినట్లు పోలీస్‌స్టేషన్ సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. రాత్రి 2.43 గంటలకు రాజవరం రైస్ మిల్లును దాటుతూ ఎద్దులతో కూడిన వాహనాలు వెళ్లినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. డొక్కలబావితండాలోని పలుచోట్ల సీసీ కెమెరాలను పరిశీలించగా, అటువైపు ఆటో, ద్విచక్రవాహనం రాలేదని గుర్తించి ఇదే విషయాన్ని పోలీసులకు చెప్పారు. గరెకనట్‌తండాలో కొందరు పశువుల వ్యాపారం చేస్తున్నట్లు సమీప గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న బాధిత రైతు తన గ్రామస్థులతో కలిసి అక్కడికి వెళ్లి ఆరా తీశాడు. అక్కడ కొన్ని పశువులు ఉన్నట్లు తెలుసుకున్న వారు పోలీసులను వెంటబెట్టుకొని అక్కడికి వెళ్లి చూడగా రాత్రి అదే పల్లె ప్రకృతి వనంలో సుమారు 35పశువులు ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనపై విచారణ నిమిత్తం రావాలని పోలీసులు కొందరిని పిలి పించి తర్వాత వదిలేసినట్లు సమాచారం.

పశువులకు రక్షణ లేకుండా పోయింది



వ్యవసాయం కోసం నేను రెండు ఎద్దులను పెంచుకుంటున్నాను. గత బుధవారం తెల్లవారుజామున కొట్టంలో కట్టేసిన ఎద్దులను మాయం చేశారు. సుమారు రూ.1.50లక్షల విలువైన ఎద్దులను కోల్పోయాను. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులో పురోగతి లేదు. పశువులకు రక్షణ లేకుండాపోయింది. ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకొని ఈ దందాను ఆపాలి.

\- శ్రీను, నెల్లికల్ గ్రామం, తిరుమలగిరి(సాగర్) మండలం.

కబేళాలకు తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తాం

పశువులను అక్రమంగా రవాణా చేసినా కబేళాలకు తరలిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. మూగజీవాలను దొంగలించే వారిపై గతంలో పలు కేసులు నమోదు చేశాం. ఈ దందాను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

\- బీసన్న, నాగార్జునసాగర్ సీఐ.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

- గత ఏప్రిల్ 4, 2024లో తిరుమలగిరి(సాగర్) మండల పరిధిలోని తెట్టెకుంటలో ఒక రైతు తన పొలం వద్ద గల పశువుల కొట్టంలో నాలుగు ఆవులను ఉంచగా దోపిడీ ముఠా రాత్రి మాయం చేసింది.
- మే 4, 2024న కొంపల్లి గ్రామానికి చెందిన మూడు గేదెలను స్థానిక ఇన్‌ఫార్మర్ల సహాయంతో ఒక ప్రదేశానికి తరలించి రాత్రి అక్కడి నుంచి తీసుకెళ్లారు.
- మే 11, 2024న చింతలపాలెం గ్రామ సమీపంలో మేత కోసం వెళ్లిన నాలుగు గేదెలను అక్రమంగా నిర్బంధించి రాత్రి సమయంలో తీసుకెళ్లారు.
- మే 15, 2024లో చింతలపాలెం గ్రామంలో సమీప అటవీ ప్రాంతానికి మేత కోసం సంబంధిత రైతు మూడు పాడి గేదెలను వదిలిపెట్టగా వాటిని అటవీ ప్రాంతంలో ఒకచోట దాచిపెట్టి అర్ధరాత్రి కాగానే వాటిని ఆటోల్లో వేరే ప్రాంతానికి తరలించారు. ఒక చోటుకు తీసుకెళ్లి నిర్బంధించి రాత్రి కాగానే బొలేరో వాహనాల్లో అర్ధరాత్రి తీసుకెళ్లారు. కోదాడ, మాచర్లకు చెందిన కొందరు ఈ దందా చేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.

హైవేపై నుంచే మూగజీవాలను తరలిస్తున్న వైనం

- నవంబరు 17, 2022న ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో తరలిస్తున్న మూగజీవాలను పోలీసులు తనిఖీచేసి పట్టుకున్నారు.
- హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 23, 2024న ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా తుని మండలం తుల్లూరు గ్రామానికి చెందిన కొందరు బొలేరో వాహనాల్లో 13మూగ జీవాలను హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా అనుముల గ్రామ సమీపంలోని ఈశ్వర్‌నగర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడడంతో ఐదు మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. బతికున్న ఎనిమిది జీవాలను గోశాలకు తరలించారు.
- మే 17, 2024న హైదరాబాద్ సంతోష్‌నగర్, మహబూబ్‌నగర్‌కు చెందిన కొందరు లారీల్లో 54 పశువులను అక్రమంగా తరిస్తున్నారు. పట్టణానికి రాగానే హైవేపై గల డివైడర్‌కు ఢీకొట్టడంతో లారీ బోల్తాపడగా నాలుగు ఆవులు మృతిచెందాయి. బతికున్న 50జీవాలను పోలీసులు చింతపల్లి సాయి బాబా ఆలయం వద్దగల గోశాలకు పంపించారు.



రంగుండ్లతండా నుంచి అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న లారీ(ఫైల్)

శివాలయంలో దుర్గాదేవి వేడుకలు

యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, అక్టోబరు 3: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం శివాలయంలో గురువారం దేవీ శరన్నవరాత్రోత్సవాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఏటా తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం సంప్రదాయం. ఆలయం వాయువ్య దిశలో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొలి రాజు ఉదయం విష్వక్సేనుడి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాసన, అఖండ దీపారాధనలు నేత్రపర్వంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం ముందు కలశం ఉంచి దానిపై ఎర్రటి వస్త్రం, అక్షింతలు, పూవులు, పోగడ పూవులతో దుర్గమ్మను అలంకరించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం పొంగళి, పులిహోర, దానిమ్మపండ్లు సిద్ధం చేశారు. అంతకుముందు దుర్గాదేవి అష్టోత్తరం, అర్జునాకృత దుర్గాస్తోత్రం, సహస్రనామార్చనలు పఠించి, కుంకుమార్చన చేశారు. 108సార్లు మంత్రబద్ధంగా జపం చేసి దీపారాధన, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆల య ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, అర్చకులు, పురోహితులు, వేద పండితులు పాల్గొన్నారు. కాగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనుడి తొలిపూజలతో లక్ష్మీనృసింహుల కల్యాణతంతు నిర్వహించారు. సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ.10,41,486 నిత్య ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబసమేతంగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



శివాలయంలో దుర్గాదేవికి హారతి నివేదిస్తున్న అర్చకుడు

బాల్‌బాడ్మింటన్ జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 3: నల్లగొండ జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ మైదానంలో బాల్ బాడ్మింటన్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లానుంచి 40మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన బాల, బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. **బాలికల విభాగంలో..** వి. దీపిక, భవ్యశ్రీ, అలీనా, ఏకాంబదేశ్వరీ, శృతి, సాత్విక, ఊహిత, శ్రీజ, హార్షిత, అక్షర, **బాలుర విభాగంలో..** బి. రాకేష్, జి. సుశాంత్, గౌతమ్, వేణుగోపాల్, చిన్ని, లక్ష్మినర్సు, హనుమ, జశ్వంత్, బాలాజి ఎంపికయ్యారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు జరిగే తెలంగాణ రాష్ట్రఅంతర్ జిల్లాల 69వ జూనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లాప్రధాన కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న తెలిపారు. కార్యక్రమంలో బాల్ బాడ్మింటన్ జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి ఎం. స్వామి, జి. వెంకటేశ్వర్లు, శంకర్, పాండు, కోచ్ ఎం. దేవేందర్ పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు అంతర్జాతీయ అవార్డు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 3: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సోషల్‌వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. విద్య, వైద్య, సామాజికరంగాల్లో హన్యానాయక్ అందిస్తున్న సేవలను గుర్తించిన జెనసిస్ అల్టిమా సంస్థ గోల్డ్ స్టార్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది. అంతరాజ్జతీయ గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థలతో కలిసి యూఏఈ టూరిజంశాఖ ఆధ్వర్యంలో దుబాయ్‌లో జరిగిన కార్యక్రమంలో హన్యానాయక్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. హన్యానాయక్‌ను పలువురు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న హన్యానాయక్

ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

నల్లగొండ క్రైం, అక్టోబరు 3: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ హైదరాబాద్ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయడంలో విఫలం కావడంతో పాటు పీడీఎస్ రైస్ ఇతర అక్రమ కార్యక్రమాలకు సహకరిస్తున్నందున మల్టీజోన్ పరిధిలోని పలువురు ఎస్‌ఐలపై బదిలీ వేటు పడింది. వాడపల్లి ఎస్‌ఐ ఇ. రవి, హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డిని నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని పెన్పహాడ్ ఎస్‌ఐ పి.రవీందర్, ఆత్మకూర్ ఎస్‌ఐ వై. సైదులు, తుంగతుర్తి ఎస్‌ఐ ఏడుకొండలును సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయా పోలీస్‌స్టేషన్లకు ప్రస్తుతం ఎవరినీ కేటాయించలేదు. నేడో రేపో నూతన అధికారులను కేటాయించే అవకాశముంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా పరిధిలో ఇసుక అక్రమ రవాణాకు సహకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అడవిదేవులపల్లి, వేములపల్లి, నార్కట్పల్లి, చండూరు, మాడుగులపల్లి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం ఎస్‌ఐలు, ఇసుక అక్రమ రవాణాలో వసూళ్లకు పాల్పడుతున్న కొండమల్లేపల్లిలో పనిచేస్తున్న హోంగార్డు, హెడ్‌కానిస్టేబుల్ పై కూడా బదిలీ వేటు పడిన విషయం విదితమే.

అనుమానాస్పదస్థితిలో ముగ్గురు మృతి

దేవరకొండ, అక్టోబరు 3: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణం డిండి రోడ్డులోని గ్రీన్‌గార్డెన్ బార్‌అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న వ్యక్తి గురువారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం కొమ్మెపల్లి గ్రామానికి చెందిన అంకూరి బుచ్చయ్య(35) కొన్నేళ్లుగా దేవరకొండ గ్రీన్‌గార్డెన్ బార్ అండ్ రెస్టారెంట్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా బార్ మూసివేసి ఉన్నప్పటికీ అందులోనే బార్‌లో పనిచేసేవారితో కలిసి ఉన్నాడు. గురువారం ఉదయం బార్ తెరిచి శుభ్రం చేస్తున్న వారు బుచ్చయ్య తీవ్రంగా గాయపడి ఉండడాన్ని గమనించారు. వారు వెంటనే నిర్వాహకులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి చూడగా అప్పటికే బుచ్చయ్య మృతిచెంది ఉన్నాడు. బుచ్చయ్య తలకు తీవ్ర గాయమై రక్తస్రావమై ఉంది. కాగా బుచ్చయ్య మూత్ర విసర్జనకు వెళ్లి జారిపడి తలకు గాయమై మృతిచెందాడా? ఇతరులతో ఘర్షణ దిగడంతో గాయపరిచారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. బుచ్చయ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని సోదరుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు. బుచ్చయ్యకు భార్య ఉంది.



బుచ్చయ్య(ఫైల్)

సంగెం డెయిరీలో సమీపంలో ఏపీ కార్మికుడు

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని సంగెం డెయిరీలో పనిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చిన కార్మికుడు డెయిరీ సమీపంలోని బీడు భూమిలో శవమై కనిపించాడు. డెయిరీ ఫాం కార్మికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగపాడు గ్రామశివారులోని సంగెం డెయిరీలో బాపట్ల జిల్లా చిన్నగంజాం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ అలీ(37) ప్లబర్‌గా పనిలో చేరాడు. కొద్దిరోజులుగా డెయిరీలో తోటి కార్మికులతో కలిసి పనిచేస్తూ బుధవారం మధ్యాహ్నం పనిప్రదేశం నుంచి భోజనం చేయకుండా బయటకు వెళ్లాడు. అయితే నాలుగు రోజులుగా భోజనం మానేసి మద్యం మత్తులో ఉంటున్నట్లు తోటికార్మికులు పోలీసులకు తెలిపారు. సామ్యాతండా రూట్లో వెళ్తున్న వ్యక్తి డెయిరీఫామ్‌కు పక్కనే ఉన్న బీడుభూమిలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తుండగా మద్యం క్వార్టర్ల పక్కన వ్యక్తి మృతదేహం పడి ఉంది. గమనించిన సామ్యాతండాకు చెందిన చుండి సురేష్ వెంట నే సమీప డెయిరీ వద్ద పనిచేస్తున్న కూలీలతో చెప్పడంతో వారు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మాన్ మద్యానికి బానిస కావడంతో రెండేళ్లుగా భార్యపిల్లలు అతడికి దూరంగా గుంటూరు పట్టణానికి వలసవెళ్లి జీవనం సాగిస్తున్నారు. కార్మికుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపారు.

చెరువుగట్టు గుట్టపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గుట్టపై గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువుగట్టు గుట్టపైన సుమారు 46 సంవత్సరాల వయస్సు గల మగ వ్యక్తి అనారోగ్యంతో గుట్టపైన ఉన్న పార్కింగ్ స్థలం వద్ద మృతిచెందినట్లు సీనియర్ అసిస్టెంట్ ఎన్. ఇంద్రసేనారెడ్డి నార్కట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. క్రాంతికుమార్ తెలిపారు.



గుర్తుతెలియని మృతదేహం

ప్రేమించిన యువతితో వివాహం కాదని..

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 3: ప్రేమ వివాహానికి ఒప్పుకుంటారో? లేదోనని భయాందోళనకు గురై ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన చిలుక శ్రీకాంత్(22) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడంతో తల్లి, అన్న శివతో కలిసి ఉంటున్నాడు. అయితే మేనమామతో సత్సంబంధాలు లేకపోవడం, గొడవలు కావడంతో ప్రేమించిన తన కూతురిని ఇచ్చి పెళ్లి చేస్తారో? లేదో? అని శ్రీకాంత్ ఆందోళనకు గురయ్యాడు. బుధవారం సాయంత్రం అందరూ బతుకమ్మ సంబరాల్లో ఉండగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో గడియ పెట్టుకుని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బతుకమ్మ వేడుకలకు వెళ్లిన తల్లి ఇంటికి రాగా, గడియ తెరవకపోవడంతో కిటికీ నుంచి చూసింది. శ్రీకాంత్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. తల్లి రోదనను చూసి స్థానికులు కంటతడి పెట్టారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.



శ్రీకాంత్(ఫైల్)

ప్రేమించిన యువతి బంధువుల వేధింపులు తాళ లేక..

ఆత్మకూర్(ఎస్): ప్రేమించిన యువతి బంధువుల వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ సుభాని, ఖాజా కుమారుడు షేక్ సైజాన్(24)లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే సైజాన్ చివ్వెంల మండలానికి చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన యువతితో ప్రేమలో ఉన్నాడు. కానీ యువతి కుటుంబసభ్యులకు తెలియడంతో నాలుగు నెలల క్రితం సైజాన్‌పై చివ్వెంల పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి బంధువులు పలుమార్లు సైజాన్‌ను బెదిరించడంతో పాటు వేధింపులకు గురిచేశారు. దాంతో మనస్తాపంతో సైజాన్ ఈ నెల 1న రాత్రి తన స్నేహితులకు వాట్సప్‌లో 'రేపు ఇంటికి వచ్చి చూడండి' అని మెసేజ్ పంపి ఉరివేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గురువారం చుట్టుపక్కల వాళ్లు ఇంట్లోకి వెళ్లి చూడగా సైజాన్ ఇంట్లో ఉరేసుకొని ఉన్నాడు. దాంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సైజాన్ తల్లి సుభాని ఫిర్యాదు మేరకు యువతి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు. తల్లి హైదరాబాద్‌లో కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు సమాచారం.



షేక్ సైజాన్(ఫైల్)

దుర్గమ్మ నవరాత్రోత్సవాలు షురూ..

● బాలాత్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడెంలో అమ్మవారికి మొక్కుతున్న మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత



సూర్యాపేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

దుర్గా దేవి నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొలి రోజు బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంతోషిమాత, అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయాలతో పాటు మండలంలోని పలు మండపాల్లో ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు, చండీహోమం, రుద్ర హోమం, సామూహిక లలిత సహస్రనామ పారాయణాలు, సుహాసిని పూజ లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



కోదాడ నయానగర్‌లో ఆలయానికి వెళుతున్న భక్తులు



మేళ్లచెర్వు శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



కోదాడ నయానగర్‌లో..

'కుల అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

సూర్యాపేట టౌన్, అక్టోబరు 3: కుల అసమానతలకు వ్యతిరేకంగా దళితులు ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగోపి అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్ వద్ద ఆ సంఘం జెండా ఎగురవేసి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి ఏళ్లు పూర్తైయినా ఇప్పటికీ దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఈనెల 5వ తేదీ వరకు జరుగుతున్న ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మదన్, భరత్, తేజ, గోపి, మల్లేష్, చరణ్, మహేష్, లింగయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

మఠంపల్లి, అక్టోబరు 3: సాగర్ సిమెంట్స్ పరిశ్రమ పరిధిలోని గ్రామాలు, తండాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందజేస్తామని సాగర్ పరిశ్రమ ప్రతినిధి తూడి వెంకటరెడ్డి అన్నారు. సాగర్ సిమెంట్స్ సహకారంతో మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కోరిక మేరకు ప్లాంటును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండా బ్రహ్మారెడ్డి, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లాభదాయక పంటలను ఎంచుకోవాలి

గరిడేపల్లి, అక్టోబరు 3: లాభదాయక పంటలను రైతులు ఎంచుకోవాలని గడ్డిపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ ఎం.సుకుమార్ సూచించారు. గురువారం మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో రైతులకు నిర్వహించిన ఐదు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించి, రైతుల ఆదాయ మార్గాలను రెట్టింపు చేసే పంటలను ఎంచుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడటం ద్వారా భూమి కలుషిత మవుతుందని. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూఆరోగ్యంతో పాటు మానవ ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులకు ఎస్బీఐ శాఖ పరంగా అందించే ఇతర సబ్సిడీలు, రుణాలు, రైతులు, యువత ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం గడ్డిపల్లి కేవీకేను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్, శాస్త్రవేత్తలు ఏ.కిరణ్, సీహెచ్ నరేష్, టీ.మాధురి, ఎన్.సుగంధి, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతలపాలెం ఎస్ఐగా అంతిరెడ్డి బాధ్యతల స్వీకరణ

మేళ్లచెర్వు, సెప్టెంబరు 3: చింతలపాలెం ఎస్ఐగా అంతిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చింతలపాలెం ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన సైదిరెడ్డిని వీఆర్‌పై నల్గొండకు పంపారు. నల్గొండ వీఆర్‌లో ఉన్న అంతిరెడ్డిని చింతలపాలెం ఎస్ఐగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంతిరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

ఆరె కటిక సంఘం పట్టణ అధ్యక్షుడిగా పండరీనాథ్

సూర్యాపేట టౌన్, అక్టోబరు 3: ఆరె కటిక సంఘం(మాంస దుకాణదారుల సంక్షేమ సంఘం)పట్టణ నూతన కమిటీని గురువారం జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా జమల్‌పురి పండరీనాథ్, ప్రధాన కార్యదర్శిగా జమల్‌పురి రవీందర్, గౌరవ అధ్యక్షుడిగా కామ్లెకర్ శంకర్‌లాల్, జమల్‌పురి సజన్‌లాల్, ఉపాధ్యక్షుడిగా కె.విఠల్, కోశాధికారిగా సురేష్, సహాయ కార్యదర్శిగా కె.రఘుమోహన్, కార్యవర్గ సభ్యులుగా జమల్‌పురి రాజేష్, విజయ్, సంతోష్, శివ, శేఖర్, టి.శ్రీనివాస్, మహేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు అశోక్, రాంచందర్, బాబీ, కృష్ణ పాల్గొన్నారు.

ఆరె కటికలను ప్రభుత్వం ఆదుకోవాలి

సూర్యాపేటటౌన్, అక్టోబరు 3: ఆరెకటికలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సూర్యాపేట పట్టణ ఆరె కటిక సంఘం అధ్యక్షుడు కోయిల్‌కార్ నాగయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో కబేలాలో పట్టణ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఆరె కటికల భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ముందుగా సూర్యాపేట పట్టణ ఆరె కటిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కోయిల్‌కార్ నాగయ్య, ఉపాధ్యక్షుడిగా ఎంగిల్‌కార్ శ్రీనివాస్, జమల్‌పూరి బాలేశ్వర్, కార్యదర్శిగా సింకార్ చంద్రం, జనరల్ సెక్రెటరీగా జమల్‌పూరి సాయి, కోశాధికారిగా టింగిల్‌కార్ శ్రీనివాస్‌రావు, కార్యవర్గ సభ్యులుగా టి.నర్సింహారావు. టి.నరేందర్, ఆర్.సతీష్, జె.శంకర్, భానుచందర్, వినీత్, నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజు, నాగార్జున, లక్ష్మణ్, జహంగీర్, నాగరాజు, బాలాజీ, మణి, దినేష్, సాయి పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల చోరీ

హుజూర్‌నగర్ రూరల్, అక్టోబరు 3: పట్టణంలో రెండు వాహనాలు చోరీ అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోస్టాఫీస్ ఎదుట పట్టణానికి చెందిన ఎ.వెంకటేష్ తన బైక్‌ను గురువారం మధ్యాహ్నం పార్కింగ్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అదేవిధంగా మండలంలోని అంజలిపురం గ్రామంలో గురువారం ఉదయం మాపెడ్‌ను రైతు అన్నెబోయిన వెంకటేశ్వర్లు తన పొలం వద్ద పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.

పశు పోషణలో మెలకువలు పాటించాలి



గేదెలకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

కోదాడ రూరల్, అక్టోబరు 3: పశుపోషణలో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక అధికారి దామచర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఉచిత పశు ఫలదీకరణ శిబిరాన్ని కౌన్సిలర్ పెండెం వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పశువులు ఈనిన నెల రోజుల నుంచి 90రోజుల లోపు సూడి మోయాలని, మొదటగా మూడేళ్లకే చూలు నిలవాలని లేకపోతే మేత ఖర్చు అధికమై రైతులకు పశు పోషణ భారమవుతుందని అన్నారు. పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య మాట్లాడుతూ మొత్తం 116పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చామన్నారు. ఒక గేదెకు జిల్లా పశువైద్యాధికారి కృత్రిమ గర్భాధారణ చేశారు. ఈశిబిరంలో సూర్యాపేట కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకన్న, పలువురు పశువైద్యులు వీరారెడ్డి, మధు, శ్రీనివాస్, ప్రశాంత్, వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

చేతికొచ్చిన వరి పంట నేలపాలు



నేలకొరిగిన వరిపంట

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 3: చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది. బుధవారం సాయంత్రం వచ్చిన ఈదురుగాలులు, వర్షం తాకిడికి నేలకొరిగింది. మండలంలోని పాత సూర్యాపేట, శంకన్నగూడెం, దుబ్బతండా గ్రామాల్లో వరి కంకులు నేలకొరగడంతో ధాన్యం రాలిపోయింది. శంకన్నగూడెంకు చెందిన గూడూరు వెంకట్‌రెడ్డి, కుంట్ల రవీందర్‌రెడ్డి, సామా వెంకట్‌రెడ్డి, సామా మోహన్‌రెడ్డి, దుబ్బతండాకు చెందిన జాటోతు రాజు వరి పంట నేలకొరిగి ధ్వసంమైంది. పంటలు నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కనకదుర్గమ్మ ఆలయానికి వస్తువుల బహూకరణ



ఆలయానికి వస్తువులు బహూకరిస్తున్న దాతలు

మఠంపల్లి: అక్టోబరు 3: మండల కేంద్రంలో కొలువైన శ్రీకనకదుర్గ అమ్మవారికి మఠంపల్లికి చెందిన ధాతలు మన్నెం అదెమ్మ వారి అనువంశిక వారసులు మన్నెం కరుణాకర్ రెడ్డి, ఉమారాణి దంపతులు రూ.54,500లు విలువైన వెండి ఉత్తరిణి , తీర్థం గిన్నెను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు సోమయాజుల సూర్యనారాయణమూర్తికి గురువారం అందజేశారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గురవయ్య

హుజూర్‌నగర్ రూరల్, అక్టోబరు 3: మండలంలోని బూరుగడ్డ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బూరుగడ్డకు చెందిన యరగాని గురవయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కమిటీ చైర్మన్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు గురవయ్య తెలిపారు. ఆయనతో పాటు ఆలయ ధర్మకర్తలుగా గంధం అంజయ్య, తిపిరిశెట్టి హరీష్‌గుప్త, మెరిగె కవిత, వేముల నర్సింహారావు, కోలా కృష్ణ ప్రసాద్‌గౌడ్, పెనుబల్లి హనుమంతరావు, ముడుంబై హరికుమారాచార్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.

దాడి కేసులో నలుగురిపై కేసు

తిరుమలగిరి, సెప్టెంబరు 3: మంత్రాల నెపంతో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరిలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన పీట్ల పరశురాములు మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అదే కాలనీకి చెందిన వేముల యాదమ్మ, రాములు, శంకర్, రాజు దాడి చేసి గాయపర్చారు. బాదితుడు పరుశురాములు ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డిజిటల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేపై అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ లత

అనంతగిరి, అక్టోబరు 3: ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలతో పాటు వైద్య, ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయడానికి నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.లత అన్నారు. గురువారం మండలంలోని వసంతాపురం, నల్లబండతండా, తెల్లబండతండా గ్రామాల్లో ఆమె పర్యటించి డిజిటల్ సర్వేపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన పేదలకు డిజిటల్ కార్డులు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో సుష్మ, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి: ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని వివరాలతో కూడిన డిజిటల్ కార్డు అందచేస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు తెలిపారు. బుధవారం డిజిటల్ కార్డుల కోసం పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే అధికారులకు అందుబాటులో ఉండి కుటుంబ వివరాలను అందచేసి సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, కమిషనర్ బుచ్చిబాబు, ఎంపీడీవో లాజర్, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: డిజిటల్ సర్వేకు ప్రజలు సహకరించాలని ఆర్డీవో వేణుమాధవ్‌రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని 37వార్డులో డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించి మాట్లాడారు. వారి వెంట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీధర్, కౌన్సిలర్ బైరు శైలేందర్‌గౌడ్, గౌసుద్దీన్, ప్రసాద్, మనోజు, ఖదీర్, శ్వేత, ఆలేటి మాణిక్యం పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని నాగులపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేను ఆర్డీవో వేణుమాధవ్‌రావు పరిశీలించారు. గ్రామంలో 182 ఇళ్లకు, 117 ఇళ్లలో సర్వే పూర్తయ్యిందని తెలిపారు. 65 ఇళ్లను శుక్రవారం సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దారర్ ధరావత్ లాలునాయక్, ఎంపీవో సంజీవ, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఆర్ఐలు రంజిత్‌రెడ్డి, అజీజ్‌నిషా, ఎంపీఎస్‌వో రాధా, జూనియర్ అసిస్టెంట్లు అజీరుద్దీన్, నజీర్, సైదులు, పంచాయతీ కార్యదర్శులు విద్యాభారతీ, సోమయ్య, శివకుమార్, జానయ్య పాల్గొన్నారు.

పాలకవీడు: మండలంలోని రావిపహాడ్‌లో కుటుంబ సర్వేను హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శంకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ కమలాకర్, ఎంపీడీవో లక్ష్మి, సుబ్బారావు, గోపాల్ ఉన్నారు.

హుజూర్‌నగర్: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను విజయవంతం చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. పట్టణంలో డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేందర్, మునిసిపల్ కమిషనర్ యాకూబ్‌పాషా, కౌన్సిలర్లు ఓరుగంటి నాగేశ్వరరావు, రంగారావు, రాజశేఖర్‌గౌడ్, సీతారాములు, శేఖర్ రెడ్డి, నాగిరెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



కోదాడలో నివాళులర్పిస్తున్న ఎస్‌కేఎం నాయకులు

కోదాడ, అక్టోబరు 3: ఉద్యమాల్లో అశువులు బాసిన రైతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్ దొడ్డా వెంకటయ్య డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం పిలుపు మేరకు వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతు ఉద్యమంలో మృతిచెందిన రైతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 2021లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కాల్పులు జరపటం బాధాకరమన్నారు. ఈ ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీను, బి.నరసింహారావు, యం. ముత్యాలు, ఉదయగిరి, బొల్లు ప్రసాద్, రవి, శ్రీను, గోపి, నరేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లఖింపూర్‌ఖేరీ ఘటనలో రైతులను, జర్నలిస్టులను దారుణంగా హత్య చేసిన దోషులను శిక్షించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ డిమాండ్ చేశారు. లఖింపూర్‌ఖేరీ ఘటన జరిగి మూడేళ్లయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ ఎదుట సంయుక్త మోర్చా నాయకులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు.లఖింపూర్ ఖేరీకి కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న రైతుల మీదకు కేంద్ర మంత్రి కుమారుడు తన వాహనంతో దూసుకువెళ్లడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన జరిగి మూడేళ్లవుతున్నా కేంద్ర ప్రభుత్వం దోషులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రైతులకు మద్దతు ధర చట్టాలను తీసుకురావాలని, మృతిచెందిన రైతులకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటాగోపి, బూర వెంకటేశ్వర్లు, కోటయ్య, బొడ్డు శంకర్, దంతాల రాంబాబు, పోలెబోయిన కిరణ్, ప్రవీణ్, మల్లారెడ్డి, వినోద్‌రెడ్డి, పవన్, శ్రీధర్, లింగయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: లఖీమ్‌పూర్‌ఖేరీ ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకెఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, పల్లె వెంకటరెడ్డి కోరారు. రైతుల మృతికి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్‌యాదవ్, శీలం శ్రీను, హుస్సేన్, వెంకయ్య, గాంధీ, వెంకన్న, నర్సయ్య, స్వామి, మురళి, వెంకటనారాయణ, వీరమల్లు పాల్గొన్నారు.

ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కోదాడ టౌన్ అక్టోబరు 3: డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు షేక్ నహీం అన్నారు. గురు వారం కోదాడ రెవెన్యూ డివిజన్ ఆఫీస్‌కు వచ్చిన అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కె.సుందర్‌బాబు, మజహర్, అబ్బు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతగిరి: మండలంలోని శాంతినగర్ గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఖమ్మం నుంచి కోదాడ వస్తున్న వాహనం శాంతినగర్ వద్ద ఆగి ఉన్న డీసీయంను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వ్యానులో ఉన్న డ్రైవర్ రమేష్‌తోపాటు క్లీనర్ గాయాలపాలయ్యారు. వీరిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 3: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వీరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

పన్ను పెంపుపై అభ్యంతరాలు తెలపాలి

సూర్యాపేటటౌన్, అక్టోబరు 3: సూర్యాపేట మునిసిపాలిటీ విలీనమైన తొమ్మిది గ్రామ పంచాయతీల్లో పన్ను పెంపుపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా మూడు రోజుల్లో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చూడ ముచ్చటగా బతుకమ్మ సంబురాలు



సూర్యాపేటలో..

లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్, అక్టోబరు 3: పట్టణంలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గజ్జి విజయలక్ష్మీ, అంజలి, రాగిణి, ప్రభాకర్, శ్రీధర్, వాసు, నవీన్ పాల్గొన్నారు.

ప్రకృతి, పువ్వులను దేవతలుగా పూజించే పండుగ బతుకమ్మ

ప్రకృతిని, పువ్వులను దేవతలుగా పూజించే పండుగ బతుకమ్మ అని డిప్యూటీ తహసిల్దార్ నిరంజన్ అన్నారు. మండల పరిధిలోని లింగగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. డాక్టర్లు, మహిళా సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు పుష్పల, కల్యాణి, ఆరిఫ్, పద్మ, నూర్జహాన్, ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: జిల్లా కేంద్రంలోని జయ ఒలంపియాడ్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని మినీట్యాంక్‌బండ్ సద్దుల చెరువులో వదిలారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్‌లు బింగి జ్యోతి, జల్లపద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. 3 హెచ్ఎన్ఆర్ 6 లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళడాక్టర్లు